# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 19 జూలై 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 361

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD






డిఎస్సీ వాయిదాపై హైకోర్టులో విచారణ




# రాష్ట్రంలో రుణమాఫీ పండగ

- లక్ష వరకు తొలిదశలో రుణాల మాఫీ
- సచివాలయం నుంచి
- అట్టహాసంగా ప్రారంభం
- పాస్‌బుక్కులే ప్రామాణికం...
- రేషన్ కార్డులు తనిఖీలకే పరిమితం
- తొలిదశలో 11.5 లక్షల మందికి లబ్ది
- లక్షలోపు రుణాలకు రూ.6,098 కోట్లు జమ
- ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కాంగ్రెస్‌కే సాధ్యం
- హామీ ఇచ్చిన వరంగల్‌లోనే
- రాహుల్ కృతజ్ఞతా సభ
- సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్:** రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ సచివాలయంలో ప్రారంభించారు. మొదటి విడతలో భాగంగా రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేయడం కోసం ఏకంగా రూ.6,098 కోట్లను ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. దీని ద్వారా 11.5 లక్షల మంది రైతులకు లబ్ది కలగనుంది. రెండో విడతలో భాగంగా రూ.లక్షన్నర రుణమాఫీని ఈ నెలాఖరులోపు చేయనున్నారు. ఇక ఆగస్టు నెల దాటక ముందే రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేయనున్నారు. రైతుల రుణమాఫీ కోసం మొత్తంగా రూ.31 వేల కోట్లను ఖర్చు చేయనున్నారు. సచివాలయంలో గురువారం రుణమాఫీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పథకం ద్వారా లబ్ది పొందిన వివిధ జిల్లాల రైతులతో సీఎం రేవంత్ రెడ్డి ముఖాముఖిగా వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పలుచోట్ల జిల్లాల్లో రైతు వేదికల్లో ఉన్న రైతులతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడేలా ఏర్పాట్లు చేశారు. రైతులకు రుణమాఫీపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. తమకు ఆనందంగా ఉందని, పలువురు రైతులు నేరుగా సిఎంకు వివరించారు. పదేళ్లుగా ఎదురుచూస్తున్నామని, ఇలా చేస్తారని ఊహించలేదన్నారు. రుణమాఫీపై సోనియా, రాహుల్ మాటకు కట్టుబడి నిర్ణయం తీసుకున్నామని అన్నారు. వరంగల్ డిక్లరేషన్ మేరకు అమలు చేస్తున్నామని అన్నారు. ఈ క్రమంలో వరంగల్‌లో ఎక్కడైతే రాహుల్ హామీ ఇచ్చారో అక్కడే కృతజ్ఞత సబను ఏర్పాటు చేసి, రాహుల్‌ను ఆహ్వానిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, సిఎస్ శాంతికుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ మాట ఇస్తే శిలాశాసనమని మరోసారి రుజువైందని అన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ రుణమాఫీ అమలు చేస్తున్నామన్నారు. తొలివిడతగా రూ.1 లక్ష లోపు రైతు రుణాల మాఫీని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 110 రైతు వేదికల్లోని రైతులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సచివాలయం నుంచి ఆయన మాట్లాడారు. మొత్తం 11.50 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.6,098 కోట్ల నగదు జమ చేసినట్లు తెలిపారు. ఆర్థికశాఖ ఇప్పటికే బ్యాంకులకు నగదు జమ చేసింది. గతంలో రుణమాఫీ అమలు చేస్తామని ఐదేళ్లు కాలయాపన చేశారు. గత ప్రభుత్వం రుణమాఫీ పథకం సరిగా అమలు చేయలేదు. రైతు డిక్లరేషన్‌లో భాగంగా రైతులకు రుణమాఫీ చేస్తున్నాం. ఇంతకుముందు చెప్పినట్లుగానే ఈ నెలాఖరు నాటికి రూ.లక్షన్నర వరకు ఉన్న రైతు రుణాలను మాఫీ చేస్తాం. పాస్‌బుక్ ఆధారంగానే రుణమాఫీ ఉంటుంది. కుటుంబాన్ని నిర్ధారించేందుకే రేషన్ కార్డు ప్రామాణికం. రుణాలు తీసుకున్న దాదాపు 6.36 లక్షల మందికి రేషన్ కార్డులు లేవు. అందుకే పాస్‌బుక్

ఆధారంగా రుణమాఫీ చేస్తున్నాం అని వివరించారు. గత ప్రభుత్వం రూ.7లక్షల కోట్లు అప్పులు చేసింది. దీనికి ప్రతి నెలా రూ.7వేల కోట్లు వడ్డీ చెల్లిస్తున్నాం. జీతాలు, పింఛన్ల కోసం రూ.5వేల కోట్లు కేటాయిస్తున్నాం.


# రాజీనామాపై నాలుక మడతేసిన హరీష్ రావు

## అన్ని హామీలు అమలు చేస్తేనే ..అంటూ మెలిక



హైదరాబాద్:రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు

నాలుక మడతేశారు. రుణమాఫీపై తాను చెప్పినట్లుగానే రాజీనామా చేస్తా కానీ రేవంత్ ప్రభుత్వం అన్ని హామీలను అమలు చేయాలని హరీశ్‌రావు సవాల్ విసిరారు. ఆగస్ట్ 15లోపు రైతు రుణమాఫీ హామీని అమలు చేస్తే హరీష్ రావు రాజీనామా చేస్తాననిఛాలెంజ్ విసిరారని, ఆ సంగతేంటో ముందు చెప్పాలని సోషల్ మీడియాలో కాంగ్రెస్ హడావిడి చేస్తోంది. రైతు రుణమాఫీని ముందుగానే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని, తమ చిత్తశుద్ధి నిరూపించుకుంటోందని, హరీష్ రావు రాజీనామా చేసి తన మాట నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ నేతలు అన్నారు. ఈ ప్రశ్నలకు హరీష్ తాజాగా సమాధానమిచ్చారు. తానిప్పటికీ రాజీనామా ఛాలెంజ్‌కి కట్టుబడి ఉన్నానని, అయితే తాను చెప్పినట్టుగా కాంగ్రెస్ అన్ని హామీలు అమలు చేయాలని అన్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీలతోపాటు 13 హామీలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేసారు. రైతు రుణమాఫీ సహా, అధికారంలోకి వస్తే 100 రోజుల్లోగా అమలు చేస్తామన్న హామీలన్నిటినీ నెరవేరిస్తే తాను తప్పకుండా రాజీనామా చేస్తానన్నారు హరీష్ రావు. ఆగస్ట్-15లోపు రుణమాఫీ పూర్తి చేయాలని, దానితోపాటు ఆరు గ్యారెంటీలు, 13 హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తనకు పదవి ముఖ్యం కాదని, తన పదవి పోయినా ప్రజలకు న్యాయం జరిగితే అదే సంతోషమని అన్నారు హరీష్ రావు.తన ఛాలెంజ్ స్వీకరించి అయినా కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేస్తే చాలన్నారు. కేవలం రైతు రుణమాఫీపైనే తాను మాట్లాడలేదని, హామీలన్నీ అమలు చేస్తేనే రాజీనామా అని చెప్పానని గుర్తు చేశారు.



# రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు

- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు
- సి.ఎస్ శాంతి కుమారి టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

**హైదరాబాద్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వరావుపేట పెద్దవాగుకు పెద్ద ఎత్తున వరద రావడం వల్ల గేట్లు ఎత్తడంతో దిగువ భాగంలోని గ్రామాల రైతులు వరద నీటిలో చిక్కుకున్న సంఘటనకై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, ఎస్.పి, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో నేడు సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సహాయ పునరావాస చర్యలను సమీక్షించారు. డీజిపి జితేందర్, విపత్తుల నిర్వహణ శాఖ డీజీ , నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ లు కూడా పాల్గొన్న ఈ టెలీకాన్ఫరెన్స్ లో సి.ఎస్ మాట్లాడుతూ, ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రాణనష్టం కలగవద్దని రాష్ట్ర ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. పెద్ద వాగు కు చెందిన మూడు గేట్లు ఎత్తడంతో సమీపంలోని నాలుగు గ్రామాలలోకి వరద నీరు ఒక్క సారిగా చేరడంతో వ్యవసాయ భూముల్లో నీటిలో చిక్కుకున్న 28 మందిని రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ బృందాలు వెంటనే రంగంలోకి దిగి రెండు హెలికాప్టర్ల సహాయంతో రక్షించి సురక్షింత ప్రాంతాలకు తరలిచామని జిల్లా కలెక్టర్ తెలిపారు. మరో 20 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికీ ఎన్డీఆర్ఎఫ్, రాష్ట్ర రెస్క్యూ బృందాలు సహాయ పునరావాస కార్యక్రమాలలో నిమగ్నమై ఉన్నాయని అన్నారు. గుమ్మడివెల్లి, కోయగూడెం, కొత్తూరు, గాజులపల్లి గ్రామాల ప్రజలను పునరావాస శిబిరాల్లోకి తరలించే ప్రక్రియ కొనసాగుతుందని కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు అత్యంత ప్రధానమని, సహాయ పునరావాస కార్యక్రమాలకు సంబంధించి హైదరాబాద్ నుండి ఏవిధమైన సహాయ సహకారాలు కావాలన్న అందించేందుకు సిద్ధంగా ఉన్నామని సి.ఎస్ స్పష్టం చేశారు. పరిసర గ్రామాల్లోని చెరువులు, కుంటలు తెగకుండా ముందస్తు చర్యలను చేపట్టాలని జిల్లా యంత్రాంగానికి సి.ఎస్ సూచించారు. భారీ వర్షాలు, వరదల వల్ల సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించామని డీజీపీ జితెందర్ తెలిపారు. భారీ వర్షాల వల్ల ఒక్కసారిగా 40 వేల క్యూసెక్కుల వరద రావడంతో గేట్లు ఎత్తాల్సివచ్చిందని, ప్రస్తుతం వరద తగ్గిందని నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా వివరించారు.

సిఇ తో పాటు ఇతర సీనియర్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుంటున్నారని అన్నారు.

# పెద్దవాగు ప్రాజెక్టుకు భారీ గండి

భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో ఉన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల ఉమ్మడి ప్రాజెక్టు పెద్ద వాగుకు 250 మీటర్ల పొడవున గండిపడింది.




- దాదాపు 250 మీటర్ల పొడవున కొట్టుకుపోయిన ఆనకట్ట
- జలదిగ్బంధంలో తెలంగాణ, ఏపీ పరిధిలోని 14 గ్రామాలు
- రెండు వేల కుటుంబాలపై వరద ప్రభావం
- సెల్‌పోన్లు పనిచేయకపోవడంతో ఏం జరుగుతోందో తెలియని దుస్థితి
- వాగులో చిక్కుకున్న 28 మందిని హెలికాప్టర్‌తో రక్షించిన సిబ్బంది





## రుణమాఫీ నిధులను ఇతర అప్పులుకు వాడొద్దు

- నిర్దేశించిన లక్ష్యం మేరకే ఉపయోగించాలి
- బ్యాంకర్లకు డిప్యూటి సిఎం భట్టి సూచన
- రుణమాఫీపై బ్యాంకర్లతో సమీక్ష






## కవితకు ఎయిమ్స్‌లో పరీక్షలకు కోర్టు ఆదేశం

జ్యుడీషియల్ కస్టడీ జులై-22 వరకు పొడిగింపు



# డీఎస్సీ వాయిదాపై హైకోర్టులో విచారణ



హైదరాబాద్: డీఎస్సీ వాయిదా వేయాలంటూ హైకోర్టులో కేసు వేసిన పదిమందిలో ఒక్కరు కూడా డీఎస్సీ విద్యార్థులు కాదని తేలింది. వారు హైకోర్టుకు హాల్ టిక్కెట్లు అందించకపోవడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. డీఎస్సీ వాయిదాపై హైకోర్టు విచారణ జరిగింది. పదిమంది నిరుద్యోగులు పిటిషన్ దాఖలు చేశారు.నిరుద్యోగుల తరఫున సీనియర్ అడ్వకేట్ రవిచందర్ వాదించారు. నోటిఫికేషన్‌కు.. పరీక్షకు మధ్య 4 నెలల సమయం మాత్రమే ఇచ్చారన్నారు. ఈ నాలుగు నెలల వ్యవధిలో పరీక్షను వాయిదా వేయాలని నిరుద్యోగులు అనేక ఆందోళనలు చేశారని రవిచందర్ తెలిపారు. గ్రూప్ 1 పరీక్షను కూడా ఇదే రీతిలో నిర్వహించి అభ్యర్థులను గందరగోళానికి గురి చేశారన్నారు. నిరుద్యోగులు ఈ నాలుగు నెలల వ్యవధిలో అనేక పరీక్షలు రాశారన్నారు. ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారని.. జూన్ 3న టెట్ పరీక్షలు నిర్వహించారన్నారు. ప్రభుత్వం తరఫున అడిషనల్ అడ్వకేట్ జనరల్ రజనీకాంత్ రెడ్డి వాదనలు వినిపించారు. పదిమంది కోసం 2.45 లక్షల మంది నిరుద్యోగులను బలి చేయలేమని పేర్కొన్నారు. టెట్ పరీక్షకు డీఎస్సీకి దాదాపు నాలుగు నెలల సమయం ఉందన్నారు. పరీక్షల కోసం లక్షల మంది నిరుద్యోగులు ప్రిపేర్ అయ్యారన్నారు. పిటిషన్ వేసిన పదిమంది డీఎస్సీ ఎగ్జామ్కు అప్లై చేశారా? అనిహై కోర్ట్ ప్రశ్నించింది. గ్రూప్ 1 తో పాటు డిఏవో పాటు డీఎస్సీ కి అప్లై చేశారని పిటిషనర్ల తరుపు

న్యాయవాది వెల్లడించారు. డీఎస్సీ హాల్ టికెట్లు సబ్మిట్ చేయకపోవడంపై హైకోర్టు అభ్యంతరం తెలిపింది. పదిమంది పిటిషన్ వేసి ఒకరు కూడా డీఎస్సీ హాల్ టికెట్ ను ఎందుకు సబ్‌మిట్ చేయలేదని ప్రశ్నించింది. తదుపరి విచారణ ఆగస్టు 28కి హైకోర్టు వాయిదా వేసింది. అయితే డీఎస్సీ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం అయ్యాయి. ఆగస్ట్ 5కి ముగియనున్నాయి.

# రుణమాఫీ నిధులను ఇతర అప్పలుకు వాడొద్దు



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులను రుణమాఫీకే వినియోగించాలని.. ఇతర అప్పులకు ఎట్టి పరిస్థితుల్లోనూ జమ చేయొద్దని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బ్యాంకర్లకు సూచించారు. ఈ విషయంలో రైతులను ఇబ్బంది పెట్టొద్దన్నారు. కేవలం వ్యవసాయ రుణాలను మాఫీచేస్తున్నందున వాటికే జమచేయాలన్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రజాభవన్‌లో బ్యాంకర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. రైతు రుణమాఫీ దేశంలోనే చరిత్రాత్మక నిర్ణయమని చెప్పారు. రూ.2లక్షల రుణమాఫీ పథకం ద్వారా ఒకేసారి రూ.31వేల కోట్లు ఏ రాష్ట్రంలోనూ మాఫీ చేయలేదన్నారు. ఆగస్టు నెల దాటకముందే రుణమాఫీ కింద రూ.31వేల కోట్ల నిధులను విడుదల చేస్తాం. గురువారం సాయంత్రం 11 లక్షలకు పైగా రైతులకు రూ.6వేల కోట్లు విడుదల చేస్తున్నాం. ఈ నెలలలోనే రెండో దఫా రూ.లక్షన్నర వరకు బకాయి ఉన్న రైతులకు, ఆ తర్వాత రూ.2లక్షల వరకు రుణాలకు నిధులు విడుదల చేస్తాం అన్నారు. రూ.2 లక్షలకు పైబడి రుణం ఉన్న రైతులతో బ్యాంకర్లు మాట్లాడి మిగిలిన మొత్తాన్ని రికవరీ చేసుకోవాలి. ప్రభుత్వం మంజూరు చేసే రూ.2లక్షలు కలిపి మొత్తంగా ఏ రైతూ రుణ బకాయి ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చేముందు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేతగా నేను రైతు రుణమాఫీ గ్యారంటీ కార్డుపై సంతకం చేసి ప్రచారంలోకి వెళ్లాం. ఇచ్చిన మాటకు కట్టుబడి తూచా తప్పకుండా రైతు రుణమాఫీని అమలు చేసి చూపిస్తున్నాం అని అన్నారు. రూ.31వేల కోట్ల నిధులను 40లక్షల బ్యాంకు ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుంది. దేశ బ్యాంకింగ్ రంగంలో ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి రికవరీ కావడం ఓ చరిత్ర. కార్పొరేట్ బ్యాంకింగ్‌లోనూ ఇంతలా ఒకేసారి జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం.. బ్యాంకింగ్ వ్యవస్థకు పెద్ద ప్రోత్సాహం. రైతుల తరహాలోనే బ్యాంకర్లు కూడా పండుగ చేసుకోవాలి. వ్యవసాయరంగ అభివృద్ధి కోసం భవిష్యత్తులో ఎన్నో కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకురాబోతోంది. రైతు రుణమాఫీ కింద వచ్చిన నిధులను బ్యాంకర్లు జమ చేసుకొని.. భవిష్యత్తు అవసరాల కోసం రైతులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలి. రుణాలు ఇచ్చే విషయంలో ఎక్కడా అశ్రద్ధ చూపొద్దు. లీడ్ బ్యాంకు పెద్దన్న పాత్ర పోషించాలని భట్టి విక్రమార్క సూచించారు.

## కవితకు ఎయిమ్స్‌లో పరీక్షలకు కోర్టు ఆదేశం

### జ్యుడీషియల్ కస్టడీ జులై-22 వరకు పొడిగింపు

**న్యూ ఢిల్లీ:** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టయ్యి తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఎయిమ్స్‌లో చికిత్స పరీక్షలు నిర్వహించాలని కోర్టు ఆదేశించింది. అలాగే కవిత జ్యుడీషియల్ కస్టడీ జులై-22 వరకు మరోసారి న్యాయస్థానం పొడిగించింది. కవిత .అనారోగ్యంతో బాధపడుతున్న సంగతి తెలిసిందే. జ్వరంతో బాధపడుతున్న ఆమెను మంగళవారం ఢిల్లీలోని దీన్ దయాల్ ఆస్పత్రికి తరలించి సుమారు రెండు గంటలపాటు చికిత్స చేయగా కుదుటపడ్డారు. ఆస్పత్రి నుంచి మళ్లీ తీహార్ జైలుకు తరలించారు. కాగా.. కవితకు వైద్య పరీక్షల కోసం ట్రయల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా..న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఎయిమ్స్ ఆస్పత్రిలో కవితకు వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులకు.. కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. వైద్య పరీక్షలు అనంతరం నివేదికను కోర్టుకు అందించాలని కోర్టు సూచించింది. కాగా.. కవిత జ్యుడిషియల్ కస్టడీ ముగియగా.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జైలు అధికారులు రౌస్ అవెన్యూ కోర్టులో హాజరు పరిచారు. ఈ క్రమంలో తనకు ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలను, పరీక్ష ఫలితాల్లో వ్యత్యాసాలను మొత్తం పూసగుచ్చినట్లుగా న్యాయమూర్తి దృష్టికి కవిత తీసుకొచ్చారు. అస్వస్థత కారణంగా ఇటీవలే దీన్ దయాళ్ ఆసుపత్రిలో కవితకు పరీక్షలు నిర్వహించి నట్లుగా కోర్టుకు సీబీఐ, ఈడీ తరఫున లాయర్లు వివరించారు. గురువారం విచారణ సందర్భంగా ప్రైవేట్ ఆస్పత్రిలో చెకప్ కోసం కవిత తరఫున న్యాయవాదులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే.. ఎయిమ్స్‌లో కవిత ఆరోగ్య పరీక్షలకు న్యాయస్థానం ఆదేశించింది. పరీక్షల అనంతరం ఇందుకు సంబంధించి పూర్తి నివేదికను కోర్టుకు సమర్పించాల్సి ఉంటుంది. ఆ తర్వాత కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందా..? అనేదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మరోవైపు.. ఇవాళ లేదా రేపు కవితను కలవడానికి బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీష్ రావు ఢిల్లీ వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

## పెద్దవాగు ప్రాజెక్టుకు భారీ గండి



అశ్వారావుపేట: భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో ఉన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల ఉమ్మడి ప్రాజెక్టు పెద్ద వాగుకు 250 మీటర్ల పొడవున గండిపడింది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 18.6 అడుగులు దాటడం, మూడు క్రస్ట్‌గేట్లలో ఒకటి పనిచేయకపోవడంతో గురువారం రాత్రి 7.45 గంటల సమయంలో కట్ట తెగింది. దిగువన అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి, కోయరంగాపురం, కొత్తూరు, రమణక్కపేట గ్రామాలకు పాక్షికంగా నష్టం జరగ్గా... ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం కమ్మరిగూడెం, ఒంటిబండ, కోయమాదారం, కొత్తపూచిరాల, పాతపూచిరాల, అల్లూరినగర్, సొందిగొల్లగూడెం, వసంతవాడ, గుల్లవాయి, వేలేరుపాడు గ్రామాలకు భారీగా నష్టం సంభవించింది. కొన్ని గ్రామాల్లో పలు ఇళ్లు వరదలో కొట్టుకుపోయాయి. సహాయక చర్యలు చేపట్టేందుకు వరద ప్రభావిత ప్రాంతాలకు అధికారులు చేరుకునే పరిస్థితి లేకుండా పోయింది. వారంతా వేలేరుపాడులోనే ఉండిపోయారు. దాదాపు 2000 కుటుంబాలు ఎవరి దారిన వారు సురక్షిత ప్రాంతాలకు చేరుకుంటున్నట్లు సమాచారం. గురువారం ఉదయం నుంచి విద్యుత్తు సరఫరా కూడా లేకపోవడంతో సెల్‌ఫోన్లు పనిచేయడం లేదు. దీంతో ఆ గ్రామాల్లో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియని పరిస్థితి. పెద్దవాగుకు గండిపడిన నేపథ్యంలో ప్రాణనష్టం కలగకుండా చర్యలు చేపట్టాలని తెలంగాణ సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. విషయం తెలుసుకుని జిల్లా కలెక్టర్ జితేష్, నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. గండి పూడ్చేందుకు రూ.20 కోట్ల వరకు ఖర్చవుతుందని జలవనరులశాఖ డీఈ కృష్ణ తెలిపారు. ఘటనాస్థలిని సీఈ శ్రీనివాసరెడ్డి, ఈఈ సురేష్ సందర్శించారు.

# మాట ఇచ్చాం.. మాఫీ చేశాం

హైదరాబాద్: వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకుపచ్చ కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 577 రైతు వేదికల్లో హాజరైన అన్నదాతలు, ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు.

**పదేళ్లలో దఫదఫాలుగా చేసింది రూ.21 వేల కోట్లే**

"మిగులు రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ రుణమాఫీ విషయంలో రెండుసార్లు మాటతప్పారు. రూ.లక్ష రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి తొలిసారి అధికారంలోకి వచ్చిన ఆయన.. మొత్తం రూ.16 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పారు. అయిదేళ్లలో దఫదఫాలుగా రూ.12 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారు. ప్రతి రైతుకు రూ.లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి రెండోసారి అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. రూ.12 వేల కోట్లలో దఫాదఫాలుగా కేవలం రూ.9 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారు. మొత్తంగా పదేళ్లలో రూ.21 వేల కోట్లకు మించి మాఫీ చేయలేదు. గత ప్రభుత్వం ఒకేసారి రుణమాఫీ చేయకపోవడంతో వడ్డీలు మిగిలిపోయి.. రైతుల అప్పులు తీరలేదు. అన్నదాతలు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఉన్నా.. ప్రజలకిచ్చిన మాటను కేసీఆర్ నెరవేర్చలేదు. మేము ఇచ్చిన మాట ప్రకారం.. ఒకే దఫా రూ.2 లక్షల మేర రుణాలను మాఫీ చేస్తున్నాం. మా ప్రభుత్వం డిసెంబరు ఏడో తేదీనే ప్రమాణస్వీకారం చేసినా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించిన డిసెంబరు 9వ తేదీని పరిగణనలోకి తీసుకొని రుణమాఫీ చేస్తున్నాం. డిసెంబరు 9న మరో పండగ ఉంది. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ పుట్టినరోజు అది. అందుకే 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తున్నాం.

**వారి మాటలను నమ్మొద్దు**

రుణమాఫీకి రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకుంటారన్న అపోహను కొందరు సృష్టిస్తున్నారు. రేషన్‌కార్డు కేవలం కుటుంబాన్ని గుర్తించడానికి మాత్రమే. రుణమాఫీకి రేషన్‌కార్డు ప్రాతిపదిక కాదు. పాస్‌బుక్కు ప్రాతిపదికనే అమలవుతుంది. భూమి ఉండి, ఆ భూమికి పాస్‌బుక్ ఉండి, దానిపై రుణం తీసుకుంటే.. మాఫీ చేస్తాం. ఈ విషయంలో కొందరు తప్పుదోవ పట్టించేలా చెప్పే మాటలను నమ్మొద్దు. దీనిపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలి. చదువుకోని, సాంకేతిక నైపుణ్యం లేని రైతులెవరికైనా సమస్యలు తలెత్తితే.. బ్యాంకు అధికారులను సంప్రదించాలి. రుణమాఫీకి సహకరిస్తున్న బ్యాంకు అధికారులకు కృతజ్ఞతలు. రైతు ఖాతాల్లోకి మాఫీ సొమ్ము చేరేలా వ్యవసాయ శాఖ అధికారులు చూడాలి.



**సవాల్ విసిరినవారు గుర్తుపెట్టుకోవాలి**

తెలంగాణ ఏర్పడినప్పుడు ఏడాదికి రూ.6,500 కోట్ల వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి ఉండేది. గత ప్రభుత్వం చేసిన రూ.ఏడు లక్షల కోట్ల అప్పులతో ఇప్పుడు నెలకే రూ.7 వేల కోట్ల చొప్పున వడ్డీలు చెల్లించాల్సి వస్తోంది. ఆర్థిక ఇబ్బందులున్నా ఏడు నెలల కాలంలోనే రూ.29 వేల కోట్ల విలువైన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. ఇప్పుడు రుణమాఫీ చేశాం. రుణమాఫీ చేయలేమంటూ మాకు సవాల్ విసిరినవారిని రాజీనామా చేయాలంటూ మేము అడగం. కానీ, గాంధీ కుటుంబం మాట ఇస్తే తప్పదనే విషయాన్ని.. సవాళ్లు విసిరినవారు గుర్తుపెట్టుకోవాలి" అని రేవంత్‌రెడ్డి అన్నారు.సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు: భట్టికార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. "భారతదేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు ఇది. ఏ రాష్ట్రంలోనూ ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేసిన చరిత్ర ఇప్పటివరకూ లేదు. పదేళ్ల కిందట ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను రూ.7 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చి.. మాకు అప్పజెప్పారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో మాట ఇచ్చాం. దాని ప్రకారం ఒకే విడతలో రూ.31 వేల కోట్లు మాఫీ చేస్తున్నాం. 40 లక్షల రైతుల ఖాతాల తరఫున రాష్ట్ర ప్రభుత్వమే రుణాలు చెల్లిస్తోంది" అని తెలిపారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. "రైతు లోకానికి ఇది ఒక పెద్ద పండగ. క్లిష్ట పరిస్థితుల్లోనూ ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. అందుకు తగ్గట్టుగానే ఈరోజు దేశానికి తెలంగాణ మోడల్‌గా ఉండేలా కాంగ్రెస్ ప్రభుత్వం అద్భుతం సృష్టిస్తోంది. ఇందుకు రాష్ట్ర రైతాంగం తరఫున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు" అని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**11 మందికి రుణమాఫీ చెక్కుల అందజేత**

రూ.లక్ష రుణమాఫీ అయిన 11 మంది రైతులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సచివాలయంలో చెక్కులు అందజేశారు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలానికి చెందిన మలిపెద్ది చెన్నమ్మ(తొమ్మిదిరేకుల గ్రామం), జర్పుల శంకర్(చౌలపల్లి), కందుకూరు మండలానికి చెందిన చింతకింది భిక్షపతి(లేమూరు), బండి జగదాంబ(గూడూరు), ఎర్ర అండాలు(ముచ్చెర్ల), క్యాతరమోని మల్లయ్య(పెద్ద ఎల్కచర్ల-జిల్లెడ్ చౌదరిగూడ మండలం), గొడుగు చెన్నయ్య(అగిర్యాల-కొందుర్గ్ మండలం), మారమోని యాదమ్మ(తుమ్మలూరు-మహేశ్వరం మండలం), అరకోటం శారద(ముక్తమదారం-కడ్తాల్ మండలం), విట్యాల అండాలు(కృష్ణనగర్-ఫరూఖ్‌నగర్ మండలం), మల్లిగారి మాణిక్యరెడ్డి(గోపులారం-శంకర్‌పల్లి మండలం) సీఎం చేతులమీదుగా చెక్కులు అందుకున్నారు.

**నెలాఖరుకు వరంగల్‌లో భారీ బహిరంగసభ**

రైతు రుణమాఫీ హామీ ఇచ్చి నిలుపుకొన్న నేపథ్యంలో సోనియా, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలకు ధన్యవాదాలు తెలుపుదామా? అని రైతువేదికల్లో ఉన్న అన్నదాతలను ముఖ్యమంత్రి అడిగారు.

అందుకు సమ్మతిస్తూ అంతా చప్పట్లు కొట్టడంతో.. సోనియా, రాహుల్, మల్లికార్జున ఖర్గేలకు కృతజ్ఞత తెలుపుతూ

తీర్మానాన్ని ఆమోదించారు. ఏ వరంగల్ ఆర్ట్స్ కళాశాల మైదానంలో రుణమాఫీ హామీ ఇచ్చామో.. అక్కడే ఈ నెలాఖరులో కృతజ్ఞత సభ పెడతామని, దానికి రాహుల్ గాంధీని ఆహ్వానించి రాష్ట్ర రైతుల తరఫున ఆయనకు కృతజ్ఞతలు చెబుతామని రేవంత్‌రెడ్డి చెప్పారు. త్వరలోనే మంత్రివర్గ సహచరులతో కలిసి దిల్లీ వెళ్లి.. ఆయనను వరంగల్ కృతజ్ఞత సభకు ఆహ్వానిస్తామని ఆయన చెప్పారు.

## సిఎం రేవంత్‌తో మిథాలి మధుస్మిత భేటీ

### ఇషా సింగ్‌కు సిఎం రేవంత్ అభినందనలు




హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదాయ పన్ను శాఖ ప్రిన్స్‌పల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత కలిసారు. ఈ సందర్భంగా వారి మధ్య జిఎస్టీ వసూళ్లు తదితర అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. అలాగే రాష్ట్రం ఆర్థిక పరిస్థితులపైనా చర్చించారని సమాచారం. ఇకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇండియన్ అమెచ్యూర్ షూటర్ ఇషా సింగ్ కలిశారు. ప్యారిస్ లో జరగబోయే ఒలింపిక్స్‌లో 10 మీటర్ల ఎయిర్ ఫిస్టల్ విభాగంలో భారత దేశం తరఫున ఇషా సింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ సందర్భంగా మాఎను సిఎం అభినందించారు.



## తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు

హైదరాబాద్: రానున్న నాలుగు రోజులపాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. దక్షిణ, పరిసర ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం.. దాని అనుబంధ ఆవర్తనం మధ్య ట్రోపోస్పియర్ వరకు విస్తరించి ఎత్తుకు వెళ్లేకొద్ది నైరుతి దిశ వైపు వంగి ఉంది. రుతుపవన ద్రోణి ఈ రోజు కోట, గుణ, కళింగపట్నం మీదుగా వెళ్తూ మధ్య బంగాళాఖాతం వరకు సగటు సముద్ర మట్టానికి 1.5కి.మీ ఎత్తులో కొనసాగుతోంది. గాలి విచ్ఛిన్నతి ఈ రోజు 20 డిగ్రీల ఉత్తర అక్షాంశం గుండా సగటు సముద్ర మట్టానికి 3.1కి.మీ నుంచి 5.8కి.మీ ఎత్తు మధ్యలో కొనసాగుతూ ఎత్తుకు వెళ్లే కొద్దీ దక్షిణం వైపు వంగి ఉంది. ఈ ప్రభావంతో రాష్ట్రంలో నాలుగురోజులపాటు వర్షాలు కురిసే అవకాశముంది. గురువారం, శుక్రవారం రాష్ట్రంలో అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. గురువారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అతి నుంచి అత్యంత భారీ వర్షాలు పడే అవకాశముంది. దీంతో ఆ రెండు జిల్లాలకు అధికారులు రెడ్ అలర్ట్ హెచ్చరికలు జారీ చేశారు. కుమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నల్గొండ, జనగాం, సిద్ధిపేట, యాద్రాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముండటంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ అయ్యాయి. శుక్రవారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అతి నుంచి అత్యంత భారీ వర్షాలు పడనున్నట్లు వాతావరణశాఖ తెలిపింది. దీంతో ఈ నాలుగు జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది.






# అట్టహాసంగా రైతు రుణమాఫీ.

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముచ్చటించిన సిఎం.
- ఏకకాలంలో రుణమాఫీ పట్ల హర్షం వెలిబుచ్చిన అన్నదాతలు.
- బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్న రైతులు.





**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జూలై 18**

: రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన రైతు రుణమాఫీ-2024 కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి హైదరాబాద్ లోని సచివాలయం నుండి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ ప్రసాద్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం రైతు సోదరులతో భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణంలోని మార్కెట్ కమిటీలో గల రైతు వేదిక నుండి స్థానిక శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ పద్మా శరత్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ సంకేత్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సహకార సంఘాల చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, బోధన్ ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఏకకాలంలో రూ. 2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేయడం పట్ల రైతులు హర్షాతిరేకాలు వెలిబుచ్చారు. రైతు వేదిక వద్ద పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి, పరస్పరం మిఠాయిలు తినిపించుకుని సంబరాలు జరుపుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్ సందర్భం గా బోధన్ మండలానికి చెందిన యువ రైతు రవి మాట్లాడుతూ, రూ. 2 లక్షల రుణమాఫీ అమలులోకి తెచ్చి రైతాంగానికి ఎనలేని భరోసా అందించారని ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. రుణమాఫీతో రైతులంతా ఎంతో సంతోషంగా ఉన్నారని, ప్రభుత్వానికి ఎల్లవేళలా రుణపడి ఉంటారని అన్నారు. గత పది సంవత్సరాల నుండి రైతును నిలబెట్టే నాయకుడు రాష్ట్రంలో లేకుండా పోయారని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం తోడ్పాటుతో సాగు రంగంపై గట్టి నమ్మకం ఏర్పడిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ, రుణమాఫీ ద్వారా రైతుల ఖాతాలలో రూ. 31 వేల కోట్లు జమ చేస్తున్నామని తెలిపారు. మొదటగా లక్ష రూపాయల లోపు రుణాలను మాఫీ చేయడం ద్వారా గురువారం ఒక్క రోజే రాష్ట్ర వ్యాప్తంగా రూ. 6098 కోట్ల రూపాయల నిధులను రైతుల బ్యాంకు ఖాతాలలో జమ చేశామని వివరించారు. ఇందులో భాగంగానే నిజామాబాద్ జిల్లాలో రూ. 226 కోట్లు రుణమాఫీ కింద రైతుల అకౌంట్లలో పడ్డాయని సీఎం తెలిపారు. గత పాలకుల కారణంగా రాష్ట్రం 7లక్షల కోట్ల రూపాయల అప్పులలో కూరుకుపోయి, ప్రతీ నెల రూ. 7 వేల కోట్ల వడ్డీ కట్టాల్సి వస్తోందని అన్నారు. అయినప్పటికీ, రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి రుణమాఫీ హామీని అమలు చేస్తున్నామని అన్నారు. అన్నదాతకు మేలు చేకూర్చే అవకాశం లభించడం ఎంతో అదృష్టం గా భావిస్తున్నానని, 16 సంవత్సరాల తన రాజకీయ ప్రస్థానంలో ఇదెంతో సుదినమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకింత భావోద్వే గానికి లోనయ్యారు. ఏకకాలంలో రుణమాఫీ అమలు చేయడం ద్వారా తెలంగాణ రాష్ట్రం యావత్తు దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. రైతును రాజు చేయడమే తమ ప్రభుత్వ సంకల్పం అని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## కన్నకూతురుపైనే బలాత్కారం పోక్సో చట్టం కింద దగుల్బాజీ అరెస్ట్

**హైదరాబాద్:** ఓ దగుల్బాజీ తండ్రి కన్న కూతురిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ కిచకున్ని అరెస్టు చేసిన పోలీసులు కేసు నమోదు చేసారు. ఈ సంఘటన రాచకొండ కమిషనరేట్ మేడిపల్లి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడిపల్లి సాయినగర్ లో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి హాస్టల్ లో ఉండి చదువుకుంటున్న తన మైనర్ కూతురును ఇంట్లో తల్లి లేని సమయంలో బలాత్కారం చేశాడు. అనంతరం జరిగిన విషయం పక్కింటి మహిళకు తెలియడంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు జరిపి నిందితుడ్ని అదుపులోకి తీసుకుని పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు.

## బొగ్గు గనుల వేలం రద్దు చేయాలి

### రాజ్‌భవన్ ముందు కార్మికుల ఆందోళన

హైదరాబాద్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనులను వేలం వేయడాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం భూపాలపల్లి బ్రాంచి కమిటీ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య డిమాండ్ చేశారు. దేశంలోని 60 బొగ్గు బ్లాకులను వేలం వేయడాన్ని నిరసిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని రాజ్‌భవన్‌ను గురువారం ముట్టడించారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య ఆధ్వర్యంలో ఏరియా నుంచి పలువురు నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బడితల సమ్మయ్య మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి రాగానే త్వరగతినా 60 సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేసి, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగించే కుట్ర చేస్తుందని మండిపడ్డారు. సింగరేణిని ప్రైవేటీకరణ చేయడం వల్ల దేశంలో అనేకమంది ఉద్యోగాలు కోల్పోయి, వారి కుటుంబాలు రోడ్డు పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణలోని శ్రావణపల్లి ఓసీని వేలం వేయడానికి కేందప్రభుత్వం సిద్ధపడిందని, తెలంగాణ రాష్ట్రం నుంచి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేయడాన్ని అడ్డుకోకపోవడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలాన్ని రద్దు చేసి, దేశంలో 60 బొగ్గు బ్లాకులను సింగరేణికే అప్పగించి, కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని, లేకుంటే టీబీజీకేఎస్ ఆద్వర్యంలో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## నిరుద్యోగ సమస్యలపై సిఎంతో చర్చిస్తాం: బల్మూరి

హైదరాబాద్: నిరుద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తామని, సానుకూలమైన ప్రకటన వచ్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తెలిపారు. నగరంలోని బేగంపేట్ టూరిజం ఎ÷-లాజాలో నిరుద్యోగులతో ఎంపీ చామల కిరణ్‌తో కలిసి బల్మూరి సమావేశమై నిరుద్యోగుల డిమాండ్లపై చర్చించారు. ఈ సందర్భంగా బల్మూరి మాట్లాడుతూ.. డీఎస్సీ, గ్రూప్-2 పరీక్షల మధ్య తక్కువ వ్యవధి ఉందన్నారు. అయితే, అవి ఉద్దేశపూర్వకంగా ఇచ్చిన తేదీలు కావని చెప్పారు. గ్రూప్-2 పరీక్షలపై సానుకూలమైన ప్రకటన వచ్చేలా చూస్తామని, త్వరలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని తెలిపారు.

## రూ.లక్ష రుణమాఫీలో అందోల్ దే అగ్రభాగం

**హైదరాబాద్:** రూ.లక్ష రుణమాఫీలో రాష్ట్రంలో మొదటి స్థానంలో అందోల్ నియోజకవర్గం నిలిచింది. ఆ తర్వాత స్థానాల్లో హుస్నాబాద్, కల్వకుర్తి రెండు, మూడు స్థానాలు దక్కించుకున్నాయి. రూ.రెండు లక్షల రుణమాఫీలో భాగంగా మొదటి విడతలో రూ.లక్ష వరకు రుణాలను రాష్ట్ర ప్రభుత్వం గురువారం మాఫీ చేసింది. రాష్ట్రంలోని 110 నియోజకవర్గాల పరిధిలోని (9 నగర నియోజకవర్గాల్లో రైతు రుణాలు లేవు) 10,84,050 రైతు కుటుంబాలకు చెందిన 11,50,193 మంది రైతుల రుణ ఖాతాల్లో రూ.6,098.93 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. దీంతో ఆ కుటుంబాలన్నీ రుణవిముక్తం అయ్యాయి.

# రైతు రుణ మాఫీ" దేశ చరిత్రలో నిలుస్తుంది.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జూలై 18**

రెండు లక్షల "రైతు రుణ మాఫీ" దేశ చరిత్రలో నిలుస్తుందనీ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం హైదరాబాద్ నుండి గురువారం రైతు నేస్తం రైతు రుణమాఫీ 2024 నిధుల విడుదల కార్యక్రమం (కుటుంబానికి 2 లక్షల వరకు) ప్రారంభించారు. దీనిలో కామారెడ్డి మండలం క్యాసంపల్లి రైతు వేదిక నుండి వర్చువల్ పద్ధతిలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ ఆశీస్ సాంగ్వన్, ఇతర ప్రజాప్రతినిధులు రైతులు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.రుణమాఫీ నిధులను విడుదల చేసిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులనుప్రజాప్రతినిధులను అధికారులను ఉద్దేశించి మాట్లాడారు.

అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఎన్ని సమస్యలు ఎదురైనా ఆనాడు ఇచ్చిన మాట ప్రకారం సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. అదేవిధంగా వరంగల్ ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో రాహుల్ గాంధీ చేసిన వాగ్దానం ప్రకారం 2 లక్షల రూపాయల రుణమాఫీ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాధ్యం చేసి మాట నిలబెట్టుకున్నదని అన్నారు. భారతదేశ





**రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ.**
**క్యాసంపల్లి రైతు వేదిక నుండి సిఎం వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అధికారులు.**

చరిత్రలోనే ఇంత పెద్ద మొత్తంలో రైతు రుణమాఫీ చేయడం మొదటిసారి అని, ఘనత ఈ ప్రభుత్వానికే దక్కిందని అన్నారు. మొదటి విడుతగా లక్ష రూపాయల లోపు రుణం ఉన్న రైతులకు జిల్లాలో 49541 మంది రైతులకు 235 కోట్ల 61 లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని, రెండో విడతగా సున్నా నుండి 1,50,000 లోపు ఋణం ఉన్న రైతులకు, మూడో విడుతగా సున్నా నుండి 2 లక్షల లోపు రుణ మాఫీ చేయడం జరుగుతుందన్నారు. మొత్తం ఆగస్టు నెలలోనే పూర్తవుతోందని అన్నారు. రుణమాఫీకి అర్హత ఉండి ఏదైనా సాంకేతిక కారణాలతో రుణమాఫీ జాబితాలో లేని రైతులు వ్యవసాయశాఖ అధికారులను గాని, జిల్లా వ్యవసాయశాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ 7288894616 నెంబర్కు గాని సంప్రదించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదరపు కలెక్టర్ లోకల్ బాడీస్ శ్రీనివాస్ రెడ్డి, కామారెడ్డి ఆర్డీవో, మున్సిపల్ చైర్ పర్సన్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన రైతులందరికీ రుణమాఫీ.

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**




**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, జులై 18:**

అర్హులైన రైతులందరికీ పగడ్బందీగా రుణమాఫీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ షెడ్యూల్ ను ప్రకటించిన నేపథ్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బ్యాంకర్లు మరియు వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి రైతు రుణమాఫీ పై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కుటుంబం యూనిట్ గా తీసుకోని 12 డిసెంబర్ 2018 నుండి 9 డిసెంబర్ 2023 వరకు పంటరుణాలు తీసుకున్న రైతులకు 3 విడుతల్లో గరిష్టంగా 2 లక్షల రూపాయల వరకు పంట రుణమాఫీ చేయడానికి చర్యలు చేపట్టిందని అన్నారు. మొదటి విడుతలో ఈ రోజు 1 లక్షా మరియు ఆలోపు పంటరుణాలు మాఫీ చేసేందుకు బ్యాంకులకు మరియు వ్యవసాయ శాఖ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, మొదటి విడతగా జిల్లాలో 49541 మంది రైతులకు 235 కోట్ల 61 లక్షల రూపాయల రుణమాఫీ వర్తిస్తున్నందున ప్రతి బ్యాంకులో రుణమాఫీకి ప్రత్యేక నోడల్ అధికారిని నియమించుకొని ఎలాంటి సమస్య తలెత్తకుండా సంభంధిత రైతులకు మాఫీ అయ్యేలా పగడబందిగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పంట రుణాలకు మాత్రమే మాఫీ చేయాలని ఇతర రుణాలకు వర్తింపచేయరాదని బ్యాంకర్లను ఆదేశించారు. అర్హత ఉన్నవారికి ఎవరికైనా పంట రుణాల మాఫీ జరగకుంటే జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ 7288894616 నెంబర్ ను సంప్రదించాలని రైతులకు జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, ఎల్డిఎం రవికాంత్ మరియు అన్ని శాఖల బ్యాంక్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



# బోనాల వీడియో సాంగ్ ఆవిష్కరణ.




**పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్.**
**రచయిత, సింగర్ సాయి లవోలాకు అభినందన.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జులై 18:**

రచయిత, సింగర్ నేతృత్వంలో రూపొందించిన బోనాల వీడియో సాంగ్ ను అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ ఘనంగా ఆవిష్కరించారు. గురువారం నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలలో ముఖ్యమైంది బోనాల పండుగ. ప్రతి సంవత్సరం కూడా ఆషాడమాసంలో అమ్మవారి ఆలయాలలో బోనాలు సమర్పించడం, కులాలకు అతీతంగా కలిసి నిర్వహించే బోనాల పండుగ విశిష్టతను సాయి లవోల స్టూడియో ద్వారా మొట్టమొదటగా అమ్మవారి బోనాల పాటను రూపొందించారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ మాట్లాడుతూ, అద్భుతమైన బోనాల ఆడియో రచించిన, సింగర్ సాయి లవోలా, అంజలీ నీ అభినందించారు. అమ్మవారి పాటను రిలీజ్ చేయడం, వీడియో షూటింగ్, ఎడిటింగ్ చాలా అద్భుతంగా చేసిన టీం అందరినికి శుభాకంక్షలు తెలిపారు. అమ్మవారి ఆశీర్వాదంతో భవిష్యత్ లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సాయి లవోల, అంజలి, క్రాంతికుమార్,

కొరియోగ్రాఫర్ తోట ప్రశాంత్, కెమెరామెన్ వెంకట్ వర్మ , మ్యూజిక్ విజయ్ ఐలేని, ఆర్ట్ డైరెక్షన్ క్రాంతికుమార్, రాజు, లవోల స్టూడియో యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.





# మహేశ్‌బాబు పుట్టిన రోజు



ఆగస్ట్ 9న మురారి రీ రిలీజ్‌కు న్నాహాలుమహేష్ బాబు పుట్టినరోజైన ఆగస్టు 9న అభిమానులు తమ అభిమాన నటుడు జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుతూ ఉండటం ఆనవాయితీ. అయితే ఈ సంవత్సరం మహేష్ బాబు అభిమానులు రాజమౌళితో సూపర్ స్టార్ చెయ్యబోయే సినిమా గురించి ఏదైనా సమాచారం ఆరోజు ఇస్తారేమో అని ఎదురు చూస్తున్నారు. కానీ అటువంటిదేమీ ఉండకపోవచ్చు అని తెలుస్తోంది. ఎందుకంటే ఆ సినిమా ఇంకా ప్రీ ప్రొడక్షన్ స్టేజ్ లోనే వున్నట్టుగా భోగట్టా, అందుకని ఆ సినిమా నుండి ఎటువంటి అప్డేట్ ఉండకపోవచ్చు అని అంటున్నారు. అయితే ఆగస్టు 9 న మహేష్ అభిమానులు ఇంకో విధంగా సంబరాలు చేసుకోవచ్చు. 'మురారి' సినిమాని ఆగస్టు 9న మళ్ళీ థియేటర్స్ విడుదల చేస్తున్నారు. మహేష్ బాబు కెరీర్ తొలినాళ్లలోనే దర్శకుడు కృష్ణ వంశి తో పనిచేసే అవకాశం దక్కింది. కృష్ణ వంశి, మహేష్ బాబు కాంబినేషన్ లో వచ్చిన 'మురారి' సినిమా మహేష్ బాబు కెరీర్ లో ఒక కీలకమైన సినిమాగా చూపొచ్చు. ఇందులో మహేష్ బాబు నటన అత్యుత్తమంగా ఉంటుంది. ఈ సినిమా అప్పట్లో విజయవంతమైన సినిమా. నందిగం రామలింగేశ్వర రావు నిర్మాత. మహేష్ బాబు కథానాయకుడిగా నటించడం మొదలు పెట్టిన తరువాత 'మురారి' అతనికి నాలుగో సినిమా. ఈ సినిమాలో పాటలు అన్నీ పెద్ద విజయం సాధించాయి.

# అల్లు అర్జున్‌తో సుకుమార్ గొడవ పడ్డారా ?





చిత్రం షూటింగ్ డిలేపై సర్వత్రా అనుమానాలు ప్రస్తుతం టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రాలలో పుష్ప ఒకటి. బ్లాక్ బస్టర్ చిత్రం 'పుష్ప: ది రైజ్' కు సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమా భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతుంది. టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రష్మిక కథానాయికగా నటిస్తుంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుంది. అయితే ఈ సినిమాకు సంబంధించి గత రెండు రోజులుగా ఒక వార్త సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతుంది. దర్శకుడు సుకుమార్, అల్లు అర్జున్‌ల మధ్య ఉన్న రిలేషన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఆర్య సినిమాతో మొదలైన ఈ జర్నీ ఇప్పటివరకు కొనసాగుతుంది. అయితే తాజాగా వీరిద్దరి మధ్య గొడవ జరిగినట్లు తెలుస్తుంది. పుష్ప 2 షూటింగ్ చివరి దశలో ఉన్న క్రమంలో వీరిద్దరి మధ్య గొడవ జరిగినట్లు.. దీంతో అల్లు అర్జున్ సుకుమార్ మీద ఉన్న కోపంతో తన గడ్డం తీసేసి ట్రిప్‌కు చెక్కేసారని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. అయితే గడ్డం పెరిగే బన్నీ షూటింగ్‌కు వచ్చేలోపు సుకుమార్ ట్రిప్‌కు వెళ్లబోతున్నాడని తెలుస్తుంది. దీంతో ఈ విషయం నిజామా కాదా అనేది తెలియాలంటే చిత్రబృందం ప్రకటించేవరకు ఆగాల్సిందే. మరోవైపు వీరి గొడవ వలన ఈ షూటింగ్ వాయిదా పడిందని ఇప్పటికే ఆగష్టు నుంచి డిసెంబర్‌కు వాయిదా పడిన ఈ చిత్రం డిసెంబర్‌లో అయిన విడుదల అవుతుందా లేదా 2025 లోకి వెళుతుందా అనేది తెలియాల్సి ఉంది. మరోవైపు ఈ మూవీ షూటింగ్ జూలై ఎండింగ్ నాటికి ముగించాలని అల్లు అర్జున్ ఆర్డర్ వేసినట్లు సమాచారం.

అయితే షూటింగ్ పూర్తి కావడానికి ఇంకో నెల సమయం పడుతుందని. ఇప్పటికే కొన్ని ఎపిసోడ్‌లను సుకుమార్ రీడిజైన్ చేసినట్లు తెలుస్తుంది. దీంతో ఈ షూటింగ్ ఎఫెక్ట్ పడినట్లు సమాచారం. మరోవైపు వీఎఫ్ఎక్స్ వర్క్ విషయంలో సుకుమార్ కన్విన్స్ కాకపోవడంతో అవి పూర్తి కావడానికి ఎక్కువ సమయం పడుతుందని తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# ఫిల్మ్ సిటీలో శరవేగంగా తండేల్ చిత్రీకరణ

నాగచైతన్య, లేడీ పవర్‌స్టార్ సాయి పల్లవి రెండోసారి తెరపై సందడి చేయడానికి సిద్ధమయ్యారు. వీరిద్దరూ జంటగా 'తండేల్' సినిమా తెరకెక్కుతోంది. చందు మొండేటి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాస్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతోంది. ప్రధాన పాత్రధారులపై కీలకమైన టాకీ పార్టును తెరకెక్కిస్తున్నారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో నాగచైతన్య, సాయిపల్లవి డీగ్లామర్ పాత్రల్లో నటిస్తున్నారు. పాత్రలు వేషం, సంభాషణలు అత్యంత సహజంగా ఉంటాయని, భారీ హంగులతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి పంచుతుందని సినీ వర్గాలు తెలిపాయి. 'విరాటపర్వం', 'గార్గి' చిత్రాల్లో నటనకుగానూ ఉత్తమ నటిగా రెండు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాల్ని సొంతం చేసుకున్నారు సాయిపల్లవి. ఈ సందర్భంగా ఆమెని 'తండేల్' సినిమా సెట్లో ఆ చిత్రబృందం సత్కరించింది.



# సెప్టెంబర్‌లో సైమా అవార్డుల ప్రదానం





జైలర్‌తో పోటీ పడుతున్న దసరా నానిసౌత్ ఇండియా ఇంటర్నేషనల్ మూవీ అవార్డు సైమా అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సెప్టెంబరు 14, 15వ తేదీల్లో దుబాయ్ వేదికగా జరుగనుంది. ఇప్పటికే ఈ అవార్డుల కోసం పోటీ పగుతున్న చిత్రాలు, నటీనటులు, టెక్నీషియన్ల జాబితా తాజాగా వెల్లడైంది. అయితే ఇందులో సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్' ఏకంగా 12 విభాగాల్లో, తెలుగులో నాని నటించిన దసరా 11 విభాగాల్లో, హాయ్ నాన్న 10 విభాగాల్లో, మలయాళంలో టోవినో థామస్ నటించిన 2018, కన్నడలో దర్శణ్ నటించిన కాటేరా 8 విభాగాల్లో సైమా అవార్డుల కోసం పోటీ పడుతుండడం విశేషం. తెలుగులో ఉత్తమ చిత్రం జాబితాలో దసరా, బలగం, బేబీ, భగవంత్ సింగ్ కేసరి, హాయ్ నాన్న , విరూపాక్ష చిత్రాలు ఉండగా. ఉత్తమ నటులు జాబితాలో చిరంజీవి, బాలకృష్ణ, నాని, ధనుష్, సాయి ధరమ్ తేజ్ పోటీ పడుతున్నారు. ఉత్తమ కథానాయికల జాబితాలో శ్రీలీల, సంయుక్త, పాయల్ రాజ్ పుత్, కీర్తి సురేశ్, శృతి హసన్, మృణాల్ ఠాకూర్ ఉన్నారు. ఉత్తమ దర్శకులుగా అనీల్ రావిపూడి, గోపీచంద్, సాయి రాజేశ్, బాబీ, కార్తీక్ దండు ఉన్నారు. ఉత్తమ సోర్టింగ్ యాక్టర్స్‌గా బ్రహ్మానందం, రవికృష్ణ, అంగద్ బేడీ, విరాజ్ అశ్విన్, ఫృధ్వీరాజ్ సుకుమారన్, దీక్షిత్ శెట్టి ఉన్నారు. తమిళంలో ఉత్తమ చిత్రం జాబితాలో నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించిన 'జైలర్', మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ఉదయనిధి, వడివేలు నటించిన 'మామన్నన్', లోకేశ్ కనగరాజ్ లియో, మణిరత్నం పొన్నియిన్ సెల్వన్-2, వెట్రిమారన్ దర్శకత్వం వహించిన విడుదలై వంటి చిత్రాలున్నాయి. అదేవిధంగా తమిళంలో ఉత్తమ నటుల విభాగంలో రజనీకాంత్, విజయ్, విక్రమ్, శివకార్తికేయన్ (మావీరన్), ఉదయనిధి ఉన్నారు. ఉత్తమ నటి విభాగంలో త్రిష, నయనతార, ఐశ్వర్యా రాయ్, కీర్తి సురేష్, మీతా రఘునాథ్. ఐశ్వర్య రాజేష్ ఉన్నారు. ఉత్తమ దర్శకుల కేటగిరీలో నెల్సన్, లోకేష్ కనకరాజ్, మణిరత్నం, వెట్రిమారన్, అరుణ్ కుమార్, మారి సెల్వరాజ్ ఉన్నారు.

# డిసెంబర్‌లో కన్నప్ప విడుదల పుష్ప-2తో పోటీకి సన్నద్ధం

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్టుగా తెరకెక్కుతున్న చిత్రం 'కన్నప్ప' ముకేశ్ కుమార్‌సింగ్ దర్శకుడు. భారీ బడ్జెట్, పలువురు ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషించిన ఈ సినిమా విడుదల కోసం సినీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా విష్ణు పెట్టిన పోస్ట్‌తో రిలీజ్‌పై కారిటీ వచ్చింది. 'డిసెంబరు 2024' అని ఆయన ట్వీట్ చేశారు. కన్నప్ప హ్యాష్‌ట్యాగ్ జోడించారు. విడుదల తేదీని త్వరలోనే ప్రకటించే అవకాశాలున్నాయి. 'పుష్ప 2' డిసెంబరు 6న రిలీజ్ చేయనున్నట్టు టీమ్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. 'కన్నప్ప' డిసెంబరు మూడు,నాలుగో వారంలో విడుదలయ్యే అవకాశాలున్నాయని సినీ వర్గాల సమాచారం. ఈ పాన్ ఇండియా చిత్రంలో ప్రీతి ముకుందన్ హీరోయిన్. ప్రభాస్, అక్షయ్ కుమార్, శరత్‌కుమార్, మోహన్‌లాల్ తదితరులు ఈ సినిమాలో సందడి చేయనున్నారు. విష్ణు.. తిన్నడు పాత్ర పోషించారు.






అధిక భాగం షూటింగ్ న్యూజిలాండ్‌లో జరిగింది. కన్నప్ప భక్తి చిత్రం మాత్రమే కాదని, అదొక చరిత్ర అని మోహన్ బాబు ఓ సందర్భంలో అన్నారు. ఈ చిత్రానికి ఆయన నిర్మాతగా వ్యవహరించడంతో పాటు ఓ కీలక పాత్రలో నటించారు. ఈ సినిమా టీజర్ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రదర్శితమైన సంగతి తెలిసిందే. ఇటీవల సోషల్ మీడియాలోనూ విడుదలై, ప్రేక్షకులను అలరించింది.ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అత్యంత భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. ఇప్పటికే మూవీ నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు టీజర్ విడుదల చేయగా హాలీవుడ్ లెవల్లో ఉన్న ఈ టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఈ సినిమాను డిసెంబర్‌లో విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.ఒకవేళ ఇదే నిజమైతే మంచు విష్ణు భారీ సాహసం చేయబోతున్నాడు. ఎందుకంటే ఇప్పటికే డిసెంబర్‌ను బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్ బుక్ చేసుకుంది. ముఖ్యంగా టాలీవుడ్ నుంచి పాన్ ఇండియా మోస్ట్ అవైటెడ్ మూవీ పుష్ప ది రూల్ రాబోతుంది. డిసెంబర్‌లో ఈ సినిమాను విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. అయితే ఈ సినిమాకు పోటిగా కన్నప్పను దించడం అనేది సాహసంతో కూడుకున్న పని అని ఇది కన్నప్పకు ఎఫెక్ట్ పడే అవకాశం ఉందని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు. కాగా కన్నప్ప విడుదల తేదీపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## తేజస్ కంచర్ల విభిన్నమైన చిత్రం ఉరుకు పటేల టైటిల్ రోల్‌తో మూవీ



హుషారు' వంటి వైవిధ్యమైన చిత్రంతో ప్రేక్షకులను మెప్పించిన నటుడు తేజస్ కంచర్ల ఇప్పుడు మరింతగా ప్రేక్షకులకు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం తేజస్ చేస్తున్న 'ఉరుకు పటేల' చిత్రం.. ప్రేక్షకులకు ఆయనని మరింత దగ్గర చేస్తుందని ఎంతో నమ్ముతున్నారు. తాజాగా ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'గెట్ ఉరిక్కి÷డ్' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. ఈ ఫస్ట్ లుక్‌తో పాటు చిత్ర వివరాలను తాజాగా మేకర్స్ తెలియజేశారు. ముందుగా ఈ పోస్టర్‌ను గమనిస్తే.. తేజస్ కంచర్ల పరిగెడుతుంటే అతని వెనుక కత్తిని ఎవరో విసిరేసినట్లు కనిపిస్తుంది. మరో వైపు మంగళసూత్రం, పోస్టల్ బ్యాలెట్ పేపర్, పాల క్యాన్ అన్నీ కనిపిస్తున్నాయి. ఇది గ్రామీణ నేపథ్యంలో భావోద్వేగాల ప్రధానంగా సాగే చిత్రమని ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ చూస్తుంటే తెలుస్తోంది. ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని కలిగించేలా ఉంది. ఈ సినిమాలో ప్రేక్షకులకు కావాల్సిన అన్ని అంశాలు ఉంటాయనే దానికి సింబాలిక్‌గా పోస్టర్‌ని డిజైన్ చేశారు. అలాగే ఈ టైటిల్‌కు మాదిరిగానే.

. సినిమా కూడా ఉరుకే ఉరుకు అన్నట్లుగా ఉంటుందనేలా ఈ ఫస్ట్ లుక్ క్లారిటీ ఇచ్చేస్తోంది. లీడ్ ఎడ్జ్ పిక్చర్స్ బ్యానర్‌పై వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాల భాను ఈ 'ఉరుకు పటేల' సినిమాను నిర్మిస్తున్నారు. సన్నీ కూరపాటి సినిమాటోగ్రఫీ అందిస్తోన్న ఈ సినిమాకు ప్రవీణ్ లక్కరాజు సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ఇప్పటికే సినిమా చిత్రీకరణ పూర్తయ్యిందని.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని, త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేస్తామని ఈ సందర్భంగా చిత్రయూనిట్ తెలియజేసింది.